# అక్షరాలా ఆశ్చర్యం

'రాజా'

మేనేజర్ సోమశేఖరం గారు ఆనాడు మోహన్ని తిట్టిన తిట్లకి లెక్క లేదు. కాని మోహన్ ఏమాత్రం లెక్క చెయ్యలేదు. ఇది మోహన్‌కి కొత్త గాదు. అయినా ఆరోజు మేనేజర్ గొంతుక తారస్థాయి అందుకుని తోచిన తిట్లల్లా తిడుతూండడంచేత అంతా ఆశ్చర్యపడ్డారు. కాని మోహన్ మనస్సులో ఏముందో, అతను పల్లెత్తి మాట్లాడలేదు. అదే పరిస్థితిలో మరొకడున్నట్టయితే తిరగబడి ఉద్యోగానికి కూడా రాజీనామా ఇచ్చేవాడే.

సోమశేఖరం గారు పొట్టిగా లావుగా, సులోచనాలు ముక్కు చివరిని తగులుతూ ఉంటారు ఆయనకు ఒక్కగాని ఒక్క కూతురు సుందరి, చిన్నప్పుడే తల్లి పోవడంచాత ఆయన సుందరిని అల్లారుముద్దుగా పెంచారు. సుందరి కూడా గారాబం మరిగి, కొత్త కొత్తగా ఏవే ఫ్యాషన్లొస్తే వాటన్నిటినీ అవలంభిస్తూ వచ్చింది. ఒక్క కూతురే కావడంచేత ఆయన సుందరి అడిగినవన్నీ కాదనక యిస్తూ ఉండేవాడు.

ఆవేళ సోమశేఖరంగారు తిట్టి తిట్టి చాలా విసుగ్గా ఉన్నారు. అందుకని త్వరగానే పని ముగించుకుని, తనకార్లో స్వంత బంగళాముందు దిగారు. ఆయన గుమ్మములో ప్రవేశిస్తూనే సుందరి ఎక్కడికో వెడుతున్నట్టుగా ముస్తాబయి సిల్కుచీరతో వస్తోంది.

"నాన్నా, నీకు చాలా మంచిసంగతొకటి చెప్పడానికి." అని ఆయన చెయ్యి పుచ్చుకుని లోపలికి లాగడం మొదలు పెట్టింది.

ఆయన అతి కష్టంమీద శాంతం తెచ్చుకుని 'ఆహా అలాగా, అదేదో ఇక్కడే చెప్పరాదూ' అన్నారు.

"ఊహు. లోపలికివస్తేగాని చెప్పను" అని మూతిబిగించుకుని చిన్న పిల్లలా మారాం చెయ్యడం మొదలెట్టింది సుందరి.

చివరికి ఆయన గదిలోకి వచ్చి, సోఫాలో కూర్చుని, అట్టేగోల చెయ్యక చెప్పేయ్ అదేదో అన్నారు.

ఆమె సిగ్గుగా తల వంచుకుని, 'మరేమీలేదు నేను పెళ్లి చేసుకుంటున్నాను" అంది.

ఆయన సుందరి నోటంట అలాంటిమాట వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. అయిన కోపంగా ఏమిటే అన్నావ్? మళ్లీ అనూ ఆమాట" అన్నారు.

ఆమె తొణక్కుండా "నేను పెళ్లి చేసుకోవాలి లేకపోతే వీల్లేదు" అంది.

ఆయన కాస్సేపటికి ఆశ్చర్యాన్నుంచి తేరుకుని "ఇలాచూడు, నీచేత ఏ వెధవ ఇలాంటి మాటలు పలికించాడు?" అన్నాడు.

ఆమె తనేమంటోందో తెలుసుకోకుండా "నాన్నా, నువ్వే ఓరోజున నేను రాణీలాగ ఉన్నాననీ, నేనే నారాజుని వెతుక్కోవాలనీ అనలేదూ?" అనేసింది.

ఆయనకి తనతిట్టు తనకే తగిలిందని కోపం వచ్చింది. కాస్సేపటకి తేరుకుని. "సరేగాని, నిన్ను ఏ వెంగళాయి పెళ్లి చేసుకుంటానన్నాడు వాణ్ణి నాలుగు వాయిస్తాను" అన్నాడు.

"అతనికి మంచి కండలు మెలితిరిగి ఉన్నాయి. కుస్తీలో ఒకసారి మొదటిబహుమతి వచ్చిందని చెప్పాడు."

ఈ మాటలు వింటూనే ఆయన గుండెల్లో రాయి పడింది. "సుందరీ నేను ఇది వీల్లేదంటే ఏంచేస్తావ్?"

"అది మా ప్రేమ నేమీ ఆటంకపరచలేదు" అంది లైలా లాగ.

"నిన్నూ వాణ్ణీ వూడగొట్టేస్తా, వాణ్ణి తరిమేస్తా."

"అయితే మేమిద్దరం ఆత్మహత్య చేసుకుంటాం, మేం చచ్చిపోయినా మా ఆత్మలు కలిసే ఉంటాయి."

సోమశేఖరంగారు తగ్గారు. ఈ మాటలు సుందరి చాలా సీరియస్‌గా అంటోంది. ఆయనకిప్పుడప్పుడే పెళ్లి చేద్దామని లేదు. ఇంకా పై పై చదువులకి చదివిద్దామంటే ఇప్పుడే మూల కూచుని పెళ్లి చేసుకుని ఏడుద్దామనుకొంటోంది కాని ఏం చేస్తాడు?

చివరికి "సరె వాణ్ణి చూపించు" అన్నాక ఆమె కారు స్టార్టు చేసింది.

కార్లో సోమశేఖరంగారు అడిగారు "సరె నీ ప్రియుడికి ఏం పనీ?"

"అతను రచయిత. ఎన్నో పుస్తకాలు వ్రాశాడు."

సోమశేఖరంగారికి రచయితలంటే బొత్తిగా యిష్టం లేదు.

"ఈ రచయితలంతా ముష్టివాళ్లాంటి వాళ్లు. అల్లాంటివాళ్లకా నేను నిన్నిచ్చి పెళ్లి చేసేది? నేను ........."

వాక్యం పూర్తి కాకముందే కారు ఒక పెద్ద బంగాళా గేటు ముందు ఆగింది, సుందరి దిగి, "ఇదే వారిల్లు," అంది. ఇంతవరకూ సోమశేఖరం గారికి రచయితల మీద ఉండే తక్కువతనమంతా ఒక్క క్షణంలో ఎగిరి పోయింది.

యింతలో సూటూ, బూటూ హేటూ వేసుకుని ఒక యువకుడు వచ్చి, ముందర సుందరికీ తరవాత సోమశేఖరంగారికీ షేక్ హాండ్ ఇచ్చాడు.

సోమశేఖరంగారు కౌన్నిపతన్ని తేరి పార చూసి "మోహన్!" అన్నారు ఆశ్చర్యంగా.

అతను వెంటనే, "నేను మీకు గతిలేక సెక్రటరీగా చేరాననుకున్నారుగాదూ? కూటికిలేక పుస్తకాలు రాశాననుకున్నారుగాదూ? మరోదారి లేక మీ తిట్లన్నీ పడ్డాననుకున్నారుగాదూ?" అన్నాడు.

సోమశేఖరంగారు పశ్చాత్తాపంగానూ, సిగ్గుగానూ తలవంచుకున్నారు. మోహన్ అందుకున్నాడు.

"మీరిప్పుడు మీ అభిప్రాయాల్ని మార్చుకున్నారనుకుంటాను. నేనూ, సుందరీ ఒకసారి కలుసుకొని ప్రేమలో పడ్డాం. నేను ఆమెని కలుసుకోడానికి ఉపాయంగా మీ ప్రయివేటు సెక్రటరీగా చేరాను. కాగితాలకోసమూ, వాటి కోసమూ, మీ యింటికి వెడుతుండగా మా పరిచయం ఎక్కువై ప్రేమ వృద్ధి అయింది" అన్నాడు.

సోమశేఖరంగారు వాళ్ల ఇద్దరి చేతులూ కలిపి "మంచిది నాయనా, మీయిద్దరూ సుఖంగా వుండడమే నాక్కావలసింది" అన్నారు సంతోషంగా.

★

ఆనందవాణి

పోస్టుబాక్సు నెంబరు

1583

—మేనేజరు